సాక్షి
కుమురం భీం
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



బాల్ బ్యాడ్మింటన్ పోటీలు
గోలేటి టౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో శనివారం 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8లో▸



అటకెక్కిన ప్లాస్టిక్ నిషేధం
వాంకిడి మండలంలో ప్లాస్టిక్ నిషేధంపై పట్టింపు కరువైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.5 /25.5

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

దారితప్పుతున్న బాల్యం!

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదివే ఓ బాలుడు (5) క్లాస్‌రూంలో తోటి బాలిక (5)కు ఐలవ్‌యూ చెప్పాడు. బాలిక విషయాన్ని క్లాస్ టీచర్‌కు చెప్పడంతో అవాక్కైంది. ఐదేళ్ల బాలుడి ప్రవర్తనపై పాఠశాల యాజమాన్యం ఆరా తీయగా సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ రీల్స్ ప్రభావంతోనే అలా మాట్లాడినట్లు నిర్ధారించుకున్నారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు.

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఓప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న బాలుడు (6) తన తోటి విద్యార్థిని (6)ను క్లాస్ రూంలోనే అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో విద్యార్థినితో పాటు ఉపాధ్యాయురాలు బెంబేలెత్తిపోయారు. ఉపాధ్యాయులు పూర్వాపరాలు ఆరా తీస్తే.. ఫోన్‌లో వీడియో షార్ట్ చూస్తూ ఆ బాలుడు క్రమంగా అలా ప్రవర్తించడం మొదలెట్టినట్లు గుర్తించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులను పిల్లలు ఎదిరించి మాట్లాడుతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. పిల్ల లు చిన్న వయసు నుంచి పెడదారి పడుతుండడం ఆందోళన కలిగించే అంశం.



కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ఓ గ్రామంలో గత జనవరిలో ఇంటర్ చదివే నలుగురు యువకులు గొడవపడ్డారు. డయల్ 100కు సమాచారం రావడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు ఘటనాస్థలికి వెళ్లారు. గొడవను ఆపేందుకు ప్రయత్నం చేసిన ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లను ఇద్దరు యువకులు తోసేసి వారి విధులకు ఆటంకం కలిగించారు. సదరు యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో గాడితప్పుతున్న బాల్యానికి ఈ ఘటనలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

- సెల్‌ఫోన్లకు బానిసవుతున్న విద్యార్థులు
- చిన్నారుల ప్రవర్తనపై తల్లిదండ్రుల నిఘా కరువు
- కట్టడి చేయకపోతే ప్రమాదమంటున్న నిపుణులు

జిల్లా వివరాలు	1-5 ఏళ్ల చిన్నారులు	1-5 ఏళ్లు అంగన్‌వాడీ బయట విద్యార్థులు	6-17 ఏళ్ల పాఠశాల, కళాశాల విద్యార్థులు
	35,556	444	1,11,757
6-17 ఏళ్ల బడి బయట విద్యార్థులు: 3,150	మొత్తం 1,50,907 మంది పిల్లలు		

కౌటాల(సిర్పూర్): ప్రస్తుత ఆధునిక కాలంలో పిల్లలు, మైనర్ విద్యార్థులు పెడదారి పడుతున్నారు. బాల్యంలోనే నేరాల బాట పడుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం తల్లిదండ్రులనే కాదు పోలీసులనూ ఆందోళనకు గురిచేస్తోంది. పట్టుమని పదేళ్లు కూడా లేని పిల్లలు దారి తప్పుతున్న సంఘటనలూ ఉన్నాయి. సామాజిక పరిణామాలు, కుటుంబ పరిస్థితులు, అందుబాటులోకి వచ్చిన అవసరానికి మించిన సాంకేతిక పరిజ్ఞానం వంటివి బాలలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. గంజాయి మత్తులో తూగుతున్న వారిలోనూ చాలా మంది టీనేజీ, అంతకంటే తక్కువ వయసు వారు ఉంటున్నారు. పోలీసులు వారిని పట్టుకుని కేసులు పెట్టకుండా కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతున్నారు. ఇక రోడ్లపై ద్విచక్ర వాహనా లతో రాత్రివేళ రయ్యిమంటూ దూసుకెళ్తున్న వారి లోనూ పలువురు మైనర్లే. ఎవరైనా వీరిని ప్రశ్నిస్తే ఎదురు తిరుగుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో యువతులను వేధిస్తున్న వారిలో మైనర్లే ఎక్కువ మంది ఉంటున్నారు.

నిఘా కరువు..
తల్లిదండ్రుల నుంచే పిల్లలు సంస్కారం నేర్చుకోవాలి. దురదృష్టవశాత్తు ఇప్పటి పిల్లలు చాలామంది సెల్‌ఫోన్లకు బందీలై వాటి ద్వారానే అలవాట్లు నేర్చుకుంటున్నారు. పలువురు తల్లిదండ్రులకు కూడా పిల్లలకు మంచీచెడు చెప్పే సమయం ఉండటం లేదు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లల డిమాండ్లను రెండో ఆలోచన లేకుండా అంగీకరిస్తుండడంతో వారిని అదుపు చేయడం కష్టమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పెరుగుతున్న పిల్లలు దారి తప్పుతున్నారు. పేరెంట్స్ బలహీనతలను గుర్తించడంలో పిల్లలకు ప్రావీణ్యం ఎక్కువ. వారి అభ్యర్థనను అతి గారాబంతో అంగీకరిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని గ్రహించాలి. పిల్లల ప్రవర్తను చిన్నప్పటి నుంచే గుర్తించి వారిని దారిలో పెట్టాల్సిన గురుతర బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పలువురు పేర్కొంటున్నారు. నేటి పిల్లలే రేపటి పౌరులనే విషయాన్ని తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో మర్చిపోవద్దు. పిల్లలు, యువతలో హింసాత్మక ధోరణి పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అలాంటి వారిపై నిఘా పెట్టి చెడు అలవాట్లు ఉన్నవారికి మానసిక నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించాలి. పిల్లలకు సోషల్ మీడియా వినియోగంపై ప్రభుత్వం నియంత్రణ తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

చిన్ననాటి నుంచే...

అన్నం తినకుండా మారాం చేస్తున్నారనో.. పిల్లల అల్లరి ఆపడం కోసం చాలా మంది తల్లిదండ్రులు వారిచేతికి స్మార్ట్‌ఫోన్ ఇస్తుంటారు. ప్రారంభంలో ఇది సరదాగా అనిపించినా.. క్రమేపీ అదొక వ్యసనంలా మారుతోంది. పిల్లలు సైతం పెద్దల ప్రమేయం లేకుండానే స్మార్ట్‌ఫోన్‌లో గేమ్‌లు ఆడుతున్నారు. తమకు కావాల్సిన ఆటలు డౌన్‌లోడ్ పెట్టుకుంటున్నారు. ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో మంచితో పాటు చెడు మిళితమై ఉండడంతో పాటు అతి వినియోగంతో అనర్థాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా స్మార్ట్‌ఫోన్ల వాడకం విద్యార్థుల్లో ఎక్కువైంది. పుస్తక పఠనం, క్రీడలకు బదులు స్మార్ట్‌ఫోన్లతో కాలం గడపటం ఎక్కువైంది. చాలా మంది వారికి తెలియకుండానే మానసిక రోగుల్లా మారారు. బాల్యంలో తల్లిదండ్రుల నిర్లక్ష్య ధోరణి, పేలవమైన పర్యవేక్షణ యుక్తవయసులో వారు పక్కదారి పట్టడానికి కారణమవుతున్నాయి. పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరు కావాలి. తమ పిల్లల ప్రతిభపై వ్యక్తిగతంగా చర్చించడంతో పాటు వారి అలవాట్లు, వారిలో తీసుకురావాల్సిన మార్పులు, గుణగణాలపై చర్చిస్తారు.

తల్లిదండ్రులదే బాధ్యత



పిల్లలను మంచి పౌరులుగా పెంచడంలో తల్లిదండ్రులదే పూర్తి బాధ్యత. పిల్లలు ఏడుస్తున్నారని వారికి స్మార్ట్‌ఫోన్లు ఇస్తున్నారు. సోషల్ మీడియాలో వారు ఏది చూస్తున్నారో అలానే బయట ప్రవర్తిసున్నారు. స్మార్ట్‌ఫోన్‌కు బానిసైతే కంటి, నిద్రలేమి, ఒత్తిడి, కోపం, తలనొప్పి, జ్ఞాపకశక్తి మందగించడం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. బుక్స్ చదవడం, డ్రాయింగ్, ఇన్‌డోర్, అవుట్‌డోర్ గెమ్స్ ఆడించాలి. పార్కులకు తీసుకెళ్తూ వారితో సమయం కేటాయించాలి. పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి ఉంచాలి. పిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నా యూట్యూబ్ ఛానల్‌లో చూసి పలు జాగ్రత్తలు పాటించవచ్చు.
– డాక్టర్ ఆర్.కవిత అజయ్, మానసిక వైద్యురాలు, మంచిర్యాల

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి యోగా పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శనివారం జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించినట్లు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సెప్టెంబర్ 5 నుంచి 7 వరకు నిర్మల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

ఆసిఫాబాద్: విద్యుత్ ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఏఈ రాథోడ్ శేషారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీరో విద్యుత్ ప్రమాదాల లక్ష్యంగా సర్కిల్‌లోని డివిజనల్ ఇంజనీర్ అధికారుల ద్వారా విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజన్

కాగజ్‌నగర్‌టౌన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అందరూ కలిసి కట్టుగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్ అన్నారు. శనివారం సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మండపాల నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధన ల మేరకు అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. అనంతరం ఉత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కౌటాల సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై కమలాకర్, వినాయక మండపాల నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ముంజం శ్రీనివాస్

కాగజ్‌నగర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా నెరవేర్చలేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, ఆదివారం, పండగ రోజుల్లో సెలవులు అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పద్మ, కాగజ్‌నగర్ పట్టణ అధ్యక్షురాలు భాగ్య, ప్రధాన కార్యదర్శి పంచశీల జరీన, రామజ్యోతి, శకుంతల, వాణి, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం రోడ్డుకు మరమ్మతులు

వాంకిడి: మండలంలోని సరాండిలో నిర్వహించే భవానీ జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం మట్టి రోడ్డుకు మరమ్మతులు చేపట్టినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడిగా పండుగ సందర్భంగా జరిగే భవానీ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని, రవాణాకు ఇబ్బందులు కలగకుండా రూ.60 వేలు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కెరమెరి: శాంతి భద్రతలు, నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, జీడీ, చార్జీషీట్లు, కేస్ డైరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డయల్ 100కు ప్రజల నుంచి వచ్చిన కాల్స్‌కు తక్షణమే స్పందించాలని సూచించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకునేలా ఉండాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా నిష్ఠతో పని చేయాలన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించేలా వ్యవహరించాలన్నారు. గణేశ్ ఉత్సవాల్లో అవసరమైన ప్రదేశాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరిగేలా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పనుల జాతరపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం పను ల జాతర పేరుతో కొత్త పథకం తీసుకువచ్చిందని, ఇందులో ఏయే పనులు చేపట్ట నున్నారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2,200 కోట్లతో పనుల జాతర అని చెబుతున్నారని, 18 నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోడంతో పారిశుద్ధ్య కార్మికులకు జీతా లు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. గ్రా మాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. పనుల జాతర పేరుతో ప్రభుత్వం డ్రామా ఆడుతోందని ఆరోపించారు.

‘పొలాల’ సంబరాలు



ఎద్దులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కాగజ్‌నగర్‌టౌన్: ఎద్దుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే

- ఎడ్లకు ప్రత్యేక అలంకరణ, పూజలు
- జిల్లా కేంద్రంలో భారీ ఊరేగింపు

ఆసిఫాబాద్: పొలాల అమావాస్యను శనివారం జిల్లా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకుని రైతులు తమ ఎడ్లను వివిధ రంగులతో అలంకరించి నైవేద్యం సమర్పించారు. ఉదయం ఇళ్లల్లో మట్టితో చేసిన ఎడ్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎడ్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, బెస్తవాడ, బనార్‌వాడ, తేలివాడతో పాటు పలు కాలనీలకు చెందిన రైతులు మేళతాళాలు, డప్పు చప్పుళ్ల మధ్యన నృత్యాలు చేస్తూ ఎడ్లతో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, బీజేపీ జిల్లా నాయకుడు అరిగెల నాగేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ మర్సోకోల సరస్వతి, సింగిల్‌విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిలువేరు వెంకన్న, తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో రైతులు ‘హహర హర మహాదేవ్’ అంటూ నినాదాలు చేశారు. దస్నాపూర్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు రహదారిపై ఎడ్లతో సందడిగా మారింది. పట్టణంలోని పలు ఆలయాల చుట్టూ ఎడ్లతో ప్రదక్షణలు చేశారు. కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు నివాసంలో ఎడ్లకు ప్రత్యేక పూజలు చేశారు.



జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఎడ్లతో నిర్వహిస్తున్న ర్యాలీ

జ్వరమొచ్చింది

- జిల్లాలో వైరల్ ఫీవర్ విజృంభణ
- కిటకిటలాడుతున్న ఆసుపత్రులు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులు

ఆసిఫాబాద్: జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వారం రోజులుగా జిల్లాలోని పలు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వైరల్ జ్వరాలతో పాటు టైఫాయిడ్, మలేరియా, డెంగీ కేసులు సైతం నమోదవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రతీరోజు 450 వరకు ఓపీ నమోదవుతుండగా వందకు పైగా ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు వాంకిడి, రెబ్బెన, తిర్యాణి మండలాలకు చెందిన రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని శనివారం‘సాక్షి’ విజిట్ చేయగా వార్డులు రోగులతో కిటకిటలాడుతూ కనిపించాయి. జిల్లా కేంద్రానికి చెందిన శంకరమ్మ, భూమయ్య, లింగమ్మ, రామయ్య, ఈదులవాడకు చెందిన మారయ్య, మొండక్క, రహపల్లికి చెందిన పెంటయ్యతో పాటు 255 మంది జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల్లోనే జిల్లా ఆసుపత్రిలో 189 వైరల్ కేసులు, 9 టైఫాయిడ్, ఒక మలేరియా, ఒక డెంగీ కేసు నమోదు కాగా, జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో వందల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.

ఆస్పత్రులకు రోగుల తాకిడి
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో సాధారణ సమయంలో రోజుకు 300 వరకు ఓపీ నమోదవుతుండగా వారం రోజులుగా రోగుల తాకిడి పెరిగింది. దీంతో శనివారం ఔట్‌పేషెంట్ల సంఖ్య 426కు చేరుకుంది. గతంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి 50 పడకలు ఉండగా ప్రస్తుతం జిల్లా మెడికల్ కళాశాల పరిధిలోకి వెళ్లడంతో ఆ సంఖ్య 330కి చేరుకుంది. ఆస్పత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌తో పాటు పక్క వార్డును వృద్ధులకు కేటాయించగా, రెండోఫ్లోర్‌ను జనరల్ వార్డుకు మార్చారు. దీంతో గతం కంటే అధికంగా రోగులు చికిత్స పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రజలు వైరల్ జ్వరాలతో బాధపడుతూ ఆర్ఎంపీ వైద్యులవద్ద చికిత్స పొందుతున్నారు.

పేదలపై ఆర్థిక భారం
జ్వర తీవ్రతతో బాధపడతుఉన్న మరి కొంతమంది జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్, మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పరీక్షల పేరుతో వేలల్లో బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ, టైఫాయిడ్, మలేరియా, ఇతర పరీక్షలతో పాటు బెడ్ చార్జీలు, మందుల బిల్లులు పేదలకు భారంగా మారడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు అందుబాటులో ఉండాలి. గ్రామాల్లో వైద్య సిబ్బంది శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలి. జ్వరంతో ఆసుపత్రిలో చేరిన వారికి చికిత్స అందిస్తున్నాం. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– డాక్టర్ సీతారాం, డీఎంహెచ్‌వో, ఆసిఫాబాద్

28, 29 తేదీల్లో ‘ప్రత్యేక’ శిబిరాలు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు శిబిరాలు నిర్వహించడం జరుగుతోందని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న కాగజ్‌నగర్‌లోని మండల పరిషత్ పాఠశాలలో, 29న ఆసిఫాబాద్ బాలుర పాఠశాలలో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లల కు పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు వైకల్యం చూపించే విధంగా 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, దివ్యాంగ ధ్రువీకరణపత్రంతో రావాలని సూచించారు.

లాభాల్లో 40 శాతం వాటా చెల్లించాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు రక్తాన్నే చెమట చుక్కలుగా మార్చి సంస్థను అభివృద్ధిబాటలో నడిపిస్తున్నారని, అలాంటి కార్మికులకు సంస్థ ఆర్జించిన లాభాల్లో నుంచి 40 శాతం వాటా చెల్లించాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు లాభాలు ప్రకటించకపోవడం సరికాదన్నారు. ఓసీపీలు, గనుల్లో ఉత్పత్తి అయ్యే బొగ్గును కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికులు సీహెచ్‌పీలకు తరలించి సంస్థ పురోభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. డ్రైవర్లు, క్లీనర్లు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతీనెల 10వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తిరుపతి, అశోక్, రవి, లచ్చన్న, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

‘సురవరం’ మృతి ఉద్యమాలకు తీరనిలోటు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ సీనియర్ నాయకులు బద్రి సత్యనారాయణ అన్నారు. సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు రాకేష్, తిరుపతి, రంజిత్, శ్రావణ్, ధనుంజయ్, వినీష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పశువుల వాహనం, నిందితులతో సిబ్బంది

దహెగాం: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. మండలంలోని లగ్గాం ఎక్స్ రోడ్డు వద్ద శనివారం ఉదయం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా బొలెరో వాహనంలో ఆరు పశువులను రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. మహారాష్ట్రకు చెందిన ఇలియాజ్ నవాబ్ ఖురేషి, షకీల్ ఖురేషీ, ఫరీద్‌లతో పాటు నిజామాబాద్‌కు చెందిన మొహ్మద్ రహ్మత్‌లపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, ఎస్సై రాజు, సిబ్బంది మహమూద్, విజయ్, మధు, రమేశ్, సాయి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి

సోన్: మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన రైతు పుట్టి పోశెట్టి చేనులో అడవి పందులు మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయి. శనివారం అటవీశాఖ, వ్యవసాయ శాఖ అధికారులకు రైతు సమాచారం అందించారు. ఏఈవో అశోక్ కుమార్, అటవీశాఖ బీట్ అధికారి శంషుద్దీన్, గ్రామపంచాయతీ కార్యదర్శి భూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో నష్టపరిచిన మొక్కజొన్న పంటకు పంచనామా నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని వారు తెలిపారు. అడవి పందుల దాడి నుంచి పంటలను రక్షించుకోవడానికి సలహాలు, సూచనలు చేశారు.

కోడిపందేల స్థావరాలపై దాడులు



నిందితులతో ఎస్సై రాజేందర్

కోటపల్లి: మండలంలోని కొల్లూర్‌లో కోడిపందేల స్థావరాలపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. గోదావరి నదీతీర ప్రాంతాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడిలో 9 మంది ని అదుపులోకి తీసుకోగా మరికొందరు పారి పోయారు. పట్టుకున్న వారిపై కేసు నమోదు చేసి నాలుగు సెల్‌ఫోన్లు, రూ.5400 నగదు స్వాధీనం చేసుకున్నారు. నరేశ్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో స్వల్ప గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మీటాకీస్ సమీపంలో ఓ భవనంపై ఫ్లెక్సీ కడుతుండగా 11కేవీ విద్యుత్‌లైన్‌కు తగలడంతో మందమర్రికి చెందిన రామ్ శ్రీకాంత్ అనే యువకుడు శనివారం విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో కింద పడిపోవడంతో శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలంలో ఉన్న స్థానికులు, స్నేహితులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

లక్కీడ్రా నిర్వాహకులపై కేసు నమోదు

ఆసిఫాబాద్: నిబంధనలకు విరుద్ధంగా లక్కీడ్రా పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ సంఘ సేవక్ గణేశ్ మండలికి చెందిన ఏడుగురు నిర్వాహకులతో పాటు ఇతరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాలాజీ వరప్రసాద్ శనివారం తెలిపారు. లక్కీ డ్రాలో బైక్‌లు, స్కూటీలు, సైకిళ్లను బహుమతిగా ఇస్తామని చెప్పి ఒక్కో టికెట్‌ను రూ. 500 విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. లక్కీ డ్రా పేరుతో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తలమడుగు: మండలంలోని కజ్జర్ల చెరువులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాధిక తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు దాదాపు 30 నుంచి 35 ఏళ్ల లోపు ఉంటుందన్నారు. మృతుడు గ్రీన్ కలర్ షర్టు, బ్లాక్ కలర్ పాయింట్, కుడి చేతికి ఒక కడియం ధరించి ఉన్నాడు. వివరాలు తెలిస్తే ఎస్సై 8712659928 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జనావాసాల్లో కొండ చిలువ



కొండచిలువ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రం దివ్యనగర్ కాలనీలోని ఓ ఇంటి ఆవరణలో శనివారం రాత్రి 8 అడుగులకు పైగా ఉన్న భారీ కొండచిలువ కన్పించింది. ఆ ఇంటి వారు గమనించి వెంటనే శాంతినగర్ కాలనీకి చెందిన పాములు పట్టే స్నేక్ క్యాచర్ అనిల్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అనిల్ అత్యంత చాకచక్యంగా కొండ చిలువను బంధించాడు. కొండచిలువను సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నాడు.

భక్తిమార్గం.. ఐక్యతా మంత్రం!

- స్వాతంత్య్రానికి ముందు నుంచే ఉత్సవాలకు ప్రాధాన్యత
- ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రారంభం..
- ఇప్పటికీ కొనసాగుతున్న ఐక్యతా వేడుకలు
- సాంప్రదాయ, పర్యావరణ హితంగా పండుగ



సొనాలలోని రామాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణపతి (ఫైల్)

భైంసా: భారతదేశంలో గణేశోత్సవం కేవలం మతపరమైన ఉత్సవం మాత్రమే కాదు, స్వాతంత్య్ర సమరంలో ప్రజలను సమీకరించిన చారిత్రక ఉద్యమం కూడా. బ్రిటీష్ పాలన నుంచి విముక్తి కోసం బాలగంగాధర్ తిలక్ ఈ ఉత్సవాన్ని ఒక శక్తివంతమైన వేదికగా మలిచారు. ఆంగ్లేయుల పాలన నుంచి విముక్తి కోసం దేశభక్తులు అవిశ్రాంత పోరాటం చేస్తున్న కాలమది. సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు, నలుగురు ఒకచోట కలుసుకునేందుకు కూడా బ్రిటీష్ ప్రభుత్వం అనుమతించేది కాదు. ఈ పరిస్థితుల్లో బాలగంగాధర్ తిలక్ ఒక వినూత్న ఆలోచన చేశారు. గణేశ్ ఉత్సవాల పేరిట ప్రజలను సమీకరించి స్వాతంత్య్రానికి సంబంధించిన విషయాలను ప్రజలకు చేరవేయాలనుకున్నారు. దేశభక్తి, దైవభక్తి ఉన్న తిలక్ 1893లో మహారాష్ట్రలోని పుణేలో శ్రీకస్బ గణపతిని ప్రతిష్ఠించి ఉత్సవాలు ప్రారంభించాడు. అప్పటి నుంచి ఏళ్లుగా ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

1905లో కుభీర్‌లో..

ముధోల్ ప్రాంతం నైజాం పరిపాలనలో ఉండేది. ఈ ప్రాంతం నాందేడ్ జిల్లా పరిధిలోకి వచ్చేది. గణేశ్ ఉత్సవాలను ప్రారంభించిన బాలగంగాధర్ తిలక్ దేశమంతా పర్యటించారు. ఆ క్రమంలో ఇప్పటి నిర్మల్ జిల్లాలోని ముధోల్ నియోజకవర్గ పరిధి కుభీర్‌కు చేరుకున్నారు. అప్పుడు కుభీర్‌ను పాలించే యశ్వంత్‌రావు దేశ్‌ముఖ్‌కు తిలక్ దగ్గరి బంధువు. 1905లో కుభీర్‌లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో కుభీర్‌ను పాలించే యశ్వంత్‌రావుదేశ్‌ముఖ్ గణేశ్ ఉత్సవాలను నిర్వహించేవారు. 1950 నుంచి 40ఏళ్ల పాటు కుభీర్‌కు చెందిన వైద్యనాథ్ ఉత్సవాల నిర్వహణ చూసుకున్నారు. 120 ఏళ్లుగా కుభీర్‌లో గణేశ్ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

భైంసా పట్టణంలో 106 ఏళ్లుగా..

భైంసాలో 1919లో సార్వజనిక్ గణేశ్ మండళి వారు గోపాలకృష్ణ మందిరంలో మొదటిసారిగా నారాయణవాగ్ సమక్షంలో ఉత్సవాలు ప్రారంభించారు. 106 ఏళ్లుగా మందిరంలో సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నిమజ్జనం రోజున ఇక్కడే పూజలు చేసి శోభాయాత్ర ప్రారంభిస్తారు. 1921లో హతిగణేశ్ మండలి ఉత్సవాలు ప్రారంభించింది. ప్రస్తుతం భైంసా పట్టణంలో 100కు పైగా మండలీలు గణేశ్ ఉత్సవాలను జరుపుకుంటున్నారు. అప్పట్లో అంతా కలిసి భజనలు చేస్తూ ఒకేచోట చేరి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు.

నిత్య పూజల్లో 'కొరడి గణపతి'



గ్రామంలో వెలసిన కొరడి గణపతి (ఫైల్)

భైంసారూరల్: మాటేగాం గ్రామంలో కొరడి గణపతి అనునిత్యం పూజలు అందుకుంటున్నాడు. 2017లో కొరడి గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. గ్రామానికి చెందిన పిప్పెర ప్రకాశ్ పటేల్ ఇంటి ముందు కుప్పగా పోసిన కట్టెల్లో పిల్లలకు గణపతిరూపం కనిపించింది. ఈ విషయాన్ని పెద్దలకు చెప్పడంతో అందరూ అక్కడికి చేరుకున్నారు. అనంతరం గ్రామంలో గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. కట్టె రూపంలో దొరికిన ఈ గణపతిని కొరడి గణపతిగా పిలుస్తున్నారు. కాగా గ్రామస్తులు కొరడి గణపతికి మందిర నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు.

ప్రతీరోజు పూజలు

కొరడి గణపతికి పూజలు చేసేందుకు ప్రతీరోజు భక్తులు వస్తుంటారు. వినాయక నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– మాధవ్‌రావు, పూజారి

కామోల్‌లో ఘనంగా..



ఉత్సవాల్లో కామోల్ రెడ్డీస్ యూత్ (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా గణేశ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. చందాలు అడగకుండా సొంతగా డబ్బులు జమ చేసి వినాయక విగ్రహాన్ని కొనుగోలు చేస్తుంటారు. యూత్ సభ్యులంతా కలిసి ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు కార్యక్రమాలను శాంతియుతంగా నిర్వహిస్తారు.

అంతా కలిసి నిర్వహిస్తాం..



రెడ్డీస్ యూత్‌లో 50 మంది సభ్యులు ఉన్నాం. కొంత మంది నిజామాబాద్, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఉన్నారు. గణేశ్ ఉత్సవాల కోసం అంతాకలిసి ఊరికి వస్తారు. యువకులంతా కార్యక్రమాల నిర్వహణతోపాటు అన్నింటిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తాం.

– అక్షయ్‌రెడ్డి, రెడ్డీస్ యూత్ సభ్యుడు

చైతన్య యూత్ ఆధ్వర్యంలో..



గణపతి వద్ద చైతన్య యూత్ బృందం (ఫైల్)

బోథ్: చైతన్య యూత్ బృందం కొన్నేళ్లుగా గణపతిని ప్రతిష్ఠిస్తూ ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకురావాలనే ఉన్నత లక్ష్యంతో ఈ ఉత్సవాలను 36 ఏళ్ల క్రితం ప్రారంభించారు. అప్పటి నుంచి కాలనీవాసులు, యువత కలిసి సాంప్రదాయాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ఏటా ఇక్కడ గణపతిని విభిన్నమైన, ప్రత్యేకమైన రూపాల్లో ప్రతిష్ఠించడం విశేషం. భక్తులు ఇక్కడ మొక్కుకుంటే తమ కోరికలు నెరవేరుతాయని బలంగా నమ్ముతున్నారు.

పర్యావరణ హిత గణపతి



చెన్నూర్: మట్టి విగ్రహం తయారు చేస్తున్న తయారీ కార్మికులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో 60 ఏళ్ల క్రితమే పర్యావరణ పరిరక్షణకు విశ్వబ్రాహ్మణులు ముందడుగు వేశారు. పట్టణానికి చెందిన అకినపల్లి నానయ్య పంతులు 1958లో మొట్టమొదటి సారిగా మట్టి గణపతి విగ్రహాన్ని తయారు చేసి ఉత్సవాలు నిర్వహించారు. అప్పటి నుంచి నేటి వరకు కూడా ఆ కులస్తులు మట్టివిగ్రహాన్ని తయారు చేసి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విశ్వబ్రాహ్మణ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు భజన చేయడంతో పాటు డీజేలు లేకుండా భక్తిపాటలతో భజన చేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఐకమత్యంతో ఉత్సవాలు..



అక్కెపల్లిలో ప్రతిష్ఠించిన వినాయకుడు (ఫైల్)

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామంలో సుమారు 30ఏళ్లుగా నిర్విరామంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి గణేశ్ మండలి పేరిట వినాయకుడిని నెలకొల్పుతున్నారు. ఏటా వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తూ ఐకమత్యంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామ సమీపంలో గల వాగులోని ఒక బండరాయిపై శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వెలిశాడు. దీంతో స్వామి పేరు మీదనే గణేశ్ మండలి ఏర్పాటు చేశారు.

సాంప్రదాయబద్ధంగా మట్టి గణపతి

బోథ్: పర్యావరణంతో పాటు హిందూ సాంప్రదాయాలను కాపాడాలని, ఈ తరానికి మట్టి గణపతి ప్రాముఖ్యత తెలియజేయడానికి మండలంలోని సొనాల గ్రామంలో గల రామాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతిని ఏటా ప్రతిష్ఠిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం భక్తిశ్రద్ధలతో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. మూడేళ్లుగా మట్టి గణపతిని ప్రతిష్ఠించి, తొమ్మిది రోజులకు భక్తి పాటలతో, భజనలతో గ్రామస్తులు నిమజ్జనం చేస్తున్నారు.

24 ఏళ్లుగా..



దండేపల్లి: మండల కేంద్రంలోని పూసల బస్తీలో శివ గణేశ్ భక్త మండలి ఆధ్వర్యంలో 24 ఏళ్లుగా గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. ఇందులో కాలనీలోని అన్ని కులాల ప్రజలు పాల్గొని 10 రోజుల పాటు ఉత్సవాలను పండుగలా జరుపుకుంటాం. నిత్యాన్నదాన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, భజనలు చేస్తుంటాం.

– బీర్ల వెంకటేశ్, మండలి సలహాదారుడు

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



లింగయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వాచ్‌మెన్ ఆవునూరి లింగయ్య(55) విద్యుదాఘాతంతో మృతిచెందాడు.. పోలీసుల కథనం ప్రకారం .. లక్సెట్టిపేట మండలం గుల్లకోటకు చెందిన ఆవునూరి లింగయ్య దొనబండలోని ఫంక్షన్ హాల్‌లో గత పదేళ్లుగా వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఫంక్షన్ హాల్‌లో పనుల నిమిత్తం శనివారం పక్కనే ఉన్న పెట్రోల్ పంప్ నుంచి ఇనుప స్టాండ్‌ను పంప్‌లో పని చేసే బుర్ర వెంకటేశ్‌గౌడ్‌తో కలిసి లింగయ్య తీసుకొస్తున్నాడు. పైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు స్టాండ్‌కు తగలడంతో షాక్‌కు గురయ్యారు. లింగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. రామగుండం మండలం కుందన్‌పల్లికి చెందిన వెంకటేశ్‌గౌడ్ స్వల్పంగా గాయపడగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్, లక్సెట్టిపేట ఎస్సై సురేశ్, నస్పూర్ ఎస్సైలు ఉపేందర్‌రావు, జితేందర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడికి భార్య రాజవ్వ, కుమారుడు జయరాజ్, కుమార్తె వసంత ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు.

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ముధోల్: మండలంలోని తరోడా గ్రామానికి చెందిన ఎయిర్ ఫోర్స్ జవాన్ లక్ష్మీఈశ్వరప్రసాద్(25) అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ఇటీవల ఆయన ఆగ్రా దగ్గరలో ఉన్న దమ్మ వాటర్‌ఫాల్‌లో ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం మృతదేహాన్ని స్వగ్రామం తరోడాకు తరలించారు. ఎయిర్‌ఫోర్స్ అధికారి ప్రవీణ్‌సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో మృతదేహంపై జవాన్లు త్రివర్ణ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. చివరి చూపు కోసం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ హాజరై నివాళులర్పించారు. శ్మశాన వాటికలో మృతదేహం చితిపై పెట్టి ఎయిర్‌ఫోర్స్ జవాన్లు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి అధికారిక లాంఛనాలతో ముగించారు. అనంతరం చితికి మృతుడి తండ్రి నిప్పంటించారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సిస్, తదితరులు పాల్గొన్నారు.

బోన్ క్యాన్సర్‌తో విద్యార్థి మృతి



అన్వేశ్ (ఫైల్)

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన పులి అన్వేశ్ (18) అనే యువకుడు బోన్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యువకుడు గత కొంత కాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధ పడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి గతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

నకిలీ విద్యుత్ వైర్ల విక్రయం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో నకిలీ విద్యుత్ వైర్లు (కేబుల్) అమ్ముతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. శనివారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఐపీ ఇన్వేస్టిగేషన్ /డిటెక్టివ్ సర్వీస్ లిమిటెడ్ కంపెనీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి నాగేశ్వర్ ఫిర్యాదు మేరకు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ షాపులను తనిఖీలు చేయగా నకిలీ విద్యుత్ వైర్లు లభ్యమయ్యాయి. నకిలీ కేబుల్ అమ్ముతున్న బాలాజీ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకుడు ప్రవీణ్, రాహుల్ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకుడు అంతర్వేది రఘునాథ్, బాలాజీ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకుడు టగ్రే జ్ఞాన్‌సింగ్, న్యూ బాలాజీ ఎలక్ట్రానిక్స్ నిర్వాహకుడు బస్సి దినేశ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పండుగ పూట విషాదం



గురుదాస్ (ఫైల్)

చింతలమానెపల్లి: పొలాల పండుగపూట విషాదం చోటు చేసుకుంది. పండుగ సందర్భంగా శనివారం పశువులను కడిగేందుకు కుంట వద్దకు వెళ్లిన యువరైతు కుంటలో పడి మృత్యువాత పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన జోడి గురుదాస్ (28) పశువులను తీసుకుని నీటికుంట వద్దకు వెళ్లాడు. మట్టితవ్వకాలతో కుంట లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో పడి ఈత రాక మృతి చెందాడు. కొంతమంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్ అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వెలికితీసి పంచనామా నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి ఆనంద్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నాటుసార పట్టివేత

కడెం: మండలంలోని పెద్దూర్‌తండా నుంచి చిన్నబెల్లాల్ గ్రామానికి నాటుసార తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. పెద్దూర్ తండాకు చెందిన ఇస్లావత్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, బైక్, మొబైల్, 15 లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ ఎస్సై అభిషేక్, సిబ్బంది వెంకటేశ్, హరీశ్, సాయి, రాజేందర్, ఇర్ఫాన్, రవళి తదితరులు ఉన్నారు.

భార్య దూకిన బావిలోనే భర్త ఆత్మహత్య



జాదవ్ దేవిశ్రీ ప్రసాద్ మృతదేహం

తలమడుగు: భార్య ఆత్మహత్య చేసుకున్న బావిలోనే భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన జాదవ్ దేవిశ్రీ ప్రసాద్(27) జిల్లా కేంద్రంలోని ఐటిఐ కాలేజీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. భార్య జాదవ్ సువాసిని జూలై 10న తలమడుగు మండలంలోని భరంపూర్ గ్రామ సమీపంలో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో భార్య సుహాసిని కుటుంబ సభ్యులు దేవిశ్రీ ప్రసాద్‌ను చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుండడంతో మనస్తాపం చెంది భార్య సుహాసిని ఆత్మహత్య చేసుకున్న బావిలోనే దూకి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి సింధుబాయి ఫిర్యాదు మేరకు ఎస్సై రాధిక కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..



నర్సింగం (ఫైల్)

నస్పూర్: ఆర్థిక ఇబ్బందులతో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ ఏరియా హిమ్మత్‌నగర్‌కు చెందిన చింతల నర్సింగం (47) శ్రీరాంపూర్ ఏరియా ఓసీలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా ఆందోళన చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఇంటి పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

కౌటాల: మండలంలోని కనికి గ్రామానికి చెందిన నాయిని మధుకర్(34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజయ్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మధుకర్ గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవపడి ఆవేశంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. శనివారం ఎస్సై మధుకర్ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించారు. మృతుడి భార్య రాంబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అట్టహాసంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం 71వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 10 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు తరలిరావడంతో సందడి నెలకొంది. పోటీలకు సుమారు 240 మంది క్రీడాకారులతో పాటు అసోషియేషన్ రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోవ లక్ష్మి బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్‌తో కలిసి మైదానంలో క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలను మారుమూల జిల్లాలో నిర్వహించడం సంతోషకరమన్నారు. క్రీడాకారులు నైపుణ్యాలను ప్రదర్శించి పోటీల్లో రాణించాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి, ఒలంపిక్ అసోషియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతి, ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు..

గోలేటిలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు మొదటి రోజే క్రీడాభిమానుల్లో ఉత్తేజాన్ని నింపేలా జరిగాయి. పురుషుల పోటీల్లో ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్ జట్లు గెలుపొందగా మహిళల విభాగంలో నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, నల్గొండ, ఖమ్మం, వరంగల్ జట్లు గెలుపొందాయి.

'ఆపరేషన్ కగార్' నిలిపి వేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ హత్యాకాండను నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. శనివారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో గల కుమురంభీం గూడలో 'చలో హన్మకొండ' బహిరంగా సభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం హన్మకొండలోని అంబేడ్కర్ భవనంలో కగార్ హత్యాకాండ, కాల్పుల విరమణ అంశంపై జరిగే బహిరంగా సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం ఆదివాసీల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను తుంగలో తొక్కుతూ ఆపరేషన్ కగార్ పేరిట మారణకాండ కొనసాగిస్తుందన్నారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్ర, డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, సోయం లలిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ కుంభకోణంలో నిందితుడు క్యాషియర్

- రూ.12.61 కోట్ల విలువైన బంగారం, రూ.1.10 కోట్ల నగదు గల్లంతు
- తొమ్మిది మంది ఖాతాలకు నగదు బదిలీ
- వివరాలు వెల్లడించిన సీఐ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ దేవేందర్‌రావు

చెన్నూర్: చెన్నూర్ ఎస్‌బీఐ బ్రాంచి-2లో నగలు, నగదు గల్లంతు లెక్క తేలింది. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు క్యాషియరేనని అధికారులు నిర్ధారించారు. స్థానిక సీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ దేవేందర్‌రావు కేసు వివరాలు వెల్లడించారు. బ్యాంక్‌లో ఖాతాదారులు తనఖా పెట్టిన నగలు, నగదు మాయమైనట్లు బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదుతో ఉన్నతాధికారులు గురువారం నుంచి శనివారం వరకు ఆడిట్ నిర్వహించారు. బ్యాంక్ క్యాషియర్ నరిగే రవీందర్ రూ.12.61 కోట్ల విలువైన బంగారు నగలు, రూ. 1.10 కోట్ల నగదు మాయం చేసినట్లు గుర్తించారు. రవీందర్ ఖాతా నుంచి తొమ్మిది మంది కొండంగి బీరేశ్, నరిగే సరిత, నరిగే స్వర్ణలత, ఉమ్మల సురేశ్, కొదాటి రాజశేఖర్, గౌడ సుమన్, ఎసంపల్లి సాయికిరణ్, ఎల్.సందీప్, మోత్కూరి రమ్యల ఖాతాలకు పెద్దఎత్తున డబ్బులు బదిలీ కాగా, అందరి ఖాతాలు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. రవీందర్‌తో పాటు మరో పది మందిపై మంచిర్యాల రీజినల్ మేనేజర్ రితేశ్‌గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు రవీందర్ పరారీలో ఉన్నారని, ఐదు పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రవీందర్ దొరికితే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని, బంగారాన్ని రికవరీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఖాతాదారులు ఆందోళన చెందొద్దని పేర్కొన్నారు.

'కస్టమర్లు ఆందోళన పడొద్దు'

చెన్నూర్: బ్యాంక్ కస్టమర్లు ఎలాంటి ఆందోళన పడొద్దని ఎస్‌బీఐ మంచిర్యాల రీజనల్ మేనేజర్ రితేశ్‌కుమార్ గుప్తా అన్నారు. శనివారం రాత్రి బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులు నిందితులను త్వరలోనే పట్టుకుంటారన్నారు. సమావేశంలో బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.